పోలీసు సిబ్బంది సంక్షేమమే మా ప్రాధాన్యం : ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర- అనకాపల్లి: జిల్లా పోలీస్ సిబ్బంది వ్యక్తిగత, వృత్తి పర, శాఖాపరమైన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కట్టుబడి ఉండే క్రమంలో, పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ తుహిన్ సిన్హా సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "పోలీసు సిబ్బంది సంక్షేమమే మా ప్రాధాన్యం. ప్రతి పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వ్యక్తిగతంగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటాం. ప్రతి విజ్ఞాపనను సానుకూలంగా పరిశీలించి, సమస్య పరిష్కారం వరకు పర్యవేక్షిస్తాను. అందరు సిబ్బంది నిర్మొహమాటంగా తమ సమస్యలను తెలియజేయాలి" అని తెలిపారు.జిల్లా పోలీస్ సిబ్బందికి మరింత అనుకూల వాతావరణం కల్పించేందుకు, ఇలాంటి వెల్ఫేర్ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

పంచాయతీలలో ఆదాయం సమకూర్చాలి

విశాలాంధ్ర-నాతవరం : ఆర్ జి ఎస్ ఏ వార్షిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాతవరం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు పంచాయతీ సర్పంచులకు, పంచాయతీ సెక్రటరీలకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొంద్రు మరిడియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఆదాయ వనరులను కాపాడుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పంచాయతీలు అభివృద్ధి పైన దృష్టి సారించా లన్నారు. ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ నిరంతరం గ్రామాలలో ప్రజలతో మమేకమవుతూ వారి నుంచి వచ్చే సలహాలు సూచనలు తీసుకొని గ్రామాల అభివృద్ధి చేయాలని, డ్రైనేజీలు పరిశుభ్రం, వాటర్ సమస్య లేకుండా చూడాలని అన్నారు. ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి పన్ను వసూలుచేయాలని, పంచాయతీలకు స్వయంగా నిధులు సమకూర్చుకునే అవకాశాలు ఉన్నాయని వాటిని వినియోగిం చుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. ముఖ్యంగా గ్రామాల శుభ్రత ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-కే కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో శుక్రవారం గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని ఈ పోటీలను ప్రారంభించి విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. జిల్లాస్థాయి టోర్నమెంటు సెలక్షన్స్ కోసం నిర్వహిస్తున్న ఈ పోటీలకు మండలంలోని 11 పాఠశాలకు చెందిన 192 మంది బాలబాలికలు పాల్గొన్నారని ఎంఈఓ డివిడి ప్రసాద్ తెలిపారు. మొదటిరోజు బాలికలకు రెండవ రోజు బాలురకు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. బాలికల విభాగంలో కబడ్డీ కోకో వాలీబాల్ చెస్ యోగ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం పద్మావతి వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి గొర్రెల రాజుబాబు ఆర్థిక సాయం

విశాలాంధ్ర -పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన తోట మల్లేశ్వరరావు, అతని భార్య సూర్యావతి ఇరువురూ ఇటీవల కాలంలో మరణించారు. వారి మరణంతో ఆ కుటుంబం నిరాధారమై పోయింది. ఆ కుటుంబంలో ఉన్న ముగ్గురు పిల్లల జీవనం కష్టంగా మారింది. దీనిపై స్పందించిన టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గొర్రెల రాజుబాబు 50 కిలోల బియ్యం, రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని గొర్రెల రాజుబాబు కోరారు. కార్యక్రమంలో తలారి రాజా, భజంత్రీల శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగునీరు

ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

విశాలాంధ్ర -కే.కోటపాడు: ఈ మండలం చంద్రయ్యపేట దళిత కాలనీలో మురుగునీరు బయటకు పోయే మార్గం లేక రోడ్డుపైనే నిల్వ ఉండటంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు అంటున్నారు. ఇరు ప్రక్కల కాలువలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ ను , పంచాయతీ కార్యదర్శి తో చెప్పినా ఫలితం లేదని అన్నారు. ఈ మురుగునీరు దుర్వాసనతో అంటురోగాల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. తక్షణమే మురుగునీటిని తొలగించి కాలువలు నిర్మించాలని సిఐటియు మండల కార్యదర్శి ఈర్లే నాయుడు బాబు అధికారులను కోరారు.

విద్యార్థి దశనుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర -నక్కపల్లి: విద్యార్థి దశనుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచు కోవాలని ఎంతోమంది విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మండలంలో శుక్రవారం గోడిచెర్ల జడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంతోమంది విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు పొందారని ఆయన అన్నారు. అనంతరం బాలుర వాలీబాల్ కబడీ కోకో పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ బి వి సత్య కుమార్ ఎంఈఓలు కే నరేష్ ఆర్ నాగన్న దొర హెచ్ఎం వేమగిరి నూకరాజు విడి ఎం లోవ కృష్ణ గుడిచర్ల పిఎసిఎస్ చైర్మన్ దార్ల కృష్ణ నక్కపల్లి పిఎసిఎస్ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ బిజెపి నాయకులు కోసూరి శ్రీనివాసరావు ఉన్నారు.

ఎమ్మెల్యే విజయకుమార్‌చే క్రీడాపోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-మునగపాక: మండల కేంద్రమైన మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల,బాలికల మండల స్థాయి క్రీడాపోటీలను యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు చేశారు.పాఠశాల స్థాయిలో చదివే విద్యార్థులు తమ చిన్నతనం నుంచే క్రీడలపై ఆశక్తి కనబరిస్తే మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు.ఇంత మంచి పరిపాలన అందిస్తున్న దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ అన్నివర్గాల వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. అనంతరం పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పనులను పెండింగ్‌లో ఉండిపోవడంపై కాంట్రాక్టరుపై అసహనం వ్యక్తం చేశారు.నిధులు విడుదల,ఖర్చులపై విచారణ చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు పెంటకోట విజయ్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురామ్,బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మళ్ల కాళేశ్వరరావు,దాడి ముసిలినాయుడు,గ్రామ ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు,నాగులాపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు యల్లపు వెంకట భాస్కరరావు,ఆడారి జనార్దన్ రావు,ఆడారి శ్రీకాంత్,మునగపాక గ్రామశాఖ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు,హై స్కూల్ కమిటీ చైర్మన్ చంద్రరామారావు,వివిధ మండలాల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ సేవింగ్స్ పై అనకాపల్లి షాపింగ్ ఫెస్టివల్

కలెక్టర్ విజయకృష్ణన్

విశాలాంధ్ర -అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న "సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్" ప్రచార కార్యక్రమంలో భాగంగా, అనకాపల్లిలోని జిఎన్‌టి రోడ్ (మెయిన్ రోడ్)లో "అనకాపల్లి షాపింగ్ ఫెస్టివల్" ఈనెల 18, 19 తేదీలలో సాయంత్రం 6.00 గంటల నుండి 9.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా తగ్గించిన జీఎస్టీ రేట్ల ప్రయోజనాలను ప్రజలకు చేరువ చేయడం, వినియోగదారుల్లో సరైన అవగాహన కల్పించడం, అలాగే చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు, గృహాల కోసం లభించే పొదుపుల గురించి స్పష్టతనివ్వడం ఈ ప్రచార లక్ష్యమని ఆమె తెలిపారు.అనకాపల్లి షాపింగ్ ఫెస్టివల్ సందర్భంగా స్థానిక వ్యాపారులు, వ్యాపార సంఘాలు, వాణిజ్య సంస్థలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఉత్పత్తులు, సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఫెస్టివల్‌లో వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు, తగ్గింపులు, అవగాహన స్టాల్స్, వినోద కార్యక్రమాలు, కస్టమర్ కౌన్సిలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జీఎస్టీ రేటు తగ్గింపు ద్వారా వస్తువుల ధరలు తగ్గడంతో ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, ఆర్థిక చైతన్యం నెలకొనడం, మరియు పన్ను వ్యవస్థపై విశ్వాసం పెరగడం వంటి ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై "అనకాపల్లి షాపింగ్ ఫెస్టివల్"లో పాల్గొని, ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ విజ్ఞప్తి చేశారు.

యూరియాకై రైతుల పడిగాపులు

చిన్న రైతులకు మరింత ఇబ్బందులు

విశాలాంధ్ర -యస్.రాయవరం: నిత్యం వ్యవసాయంపై ఆధారపడి జీవన సాగించే రైతులు ఈ సంవత్సరం యూరియా సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు .అందులో భాగంగా ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో అరకొరగా యూరియా అందించిన రైతులకు ఇబ్బందులు తప్పలేదు వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళిక పూర్తిస్థాయిలో పంపించకపోవడం దానికి తోడు వర్షాలు పడడంతో రైతులు ఎక్కువగా వరి సాగుపై దృష్టి సారించారు. కొన్నిచోట్ల ఇప్పుడు రెండు నెలలు పైగా అవ్వగా సైతారు పేట, పేటసూదిపురంలో ఆలస్యంగా ఉడుపులు జరిగాయి. దీంతో యూరియా కోసం గత రెండు రోజులుగా ఎస్. రాయవరంలోని వ్యవసాయ కార్యాలయము రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు భూమికి సంబంధించిన జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలని చెప్పడము రైతులు కార్యాలయం వద్దకు పట్టుకొని వచ్చి క్యూలైన్లో గంటలు తరబడి నిలబడి ఉంటున్నారు. వచ్చిన అరకొర యూరియాను కూడా కొందరు పెద్ద రైతులు నాయకులు సిఫార్సుతో పట్టుకొని వెళ్తున్నారని పలువురు రైతులు విమర్శిస్తున్నారు .సకాలంలోనే రైతులకు యూరియా అందించకపోతే అలాగని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పూర్తిస్థాయిలోని యూరియాను అందించాలని కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ఉద్యోగుల గ్రీవెన్స్ 11 అర్జీలు

జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్: ఉద్యోగుల యొక్క వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, డి అర్వో వై. సత్యన్నారాయణ రావు ఉద్యోగుల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిస్కారం నిమిత్తం ప్రతి నెల మూడవ శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి పలువురు ఉద్యోగులు హాజరై వారి వ్యక్తిగత సమస్యలను తెలియజేస్తూ పరిష్కారం నిమిత్తం అర్జీలు అందజేసారు. ప్రతి ఒక్కరి సమస్యను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. న్యాయమైన, పరిష్కరించుటకు అవకాశం గల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ లో 11 మంది ఉద్యోగులు వారి వ్యక్తిగత సమస్యలపై అర్జీలు అందజేయగా అందులో రెవిన్యూ శాఖ వి -3, వైద్య ఆరోగ్య శాఖవి -2, ఖజానా శాఖ, గ్రామీణ అభివృద్ధి, సర్వే మరియు ల్యాండ్ సెటిల్మెంట్, విద్యా శాఖ, వెనుకబడిన తరగతుల శాఖ, మునిసిపల్ శాఖల ఉద్యోగులు ఒకొక్కటి చొప్పున అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి విజయ్ కుమార్, పిజిఆర్ఎస్ సెల్ పర్యవేక్షకుడు సురేష్ నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బి.కింతాడ లో ఉపాధి హామీ పథకం, గ్రామ అభివృద్ధి పై గ్రామ సభ

విశాలాంధ్ర-దేవరాపల్లి: మండలంలోని బోయిల కింతాడ గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ బూరె బాబురావు అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మొదటి గ్రామసభ, గ్రామ పంచాయతీ సాధారణ గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఉపాధి హామీ వేతన కార్మికులు, గ్రామ ప్రజలు అందరికి అవగాహన కల్పించి గ్రామ అభివృద్ధికి కావాల్సిన ఉపాధి పనులు గుర్తించి వాటితో పాటు గ్రామంలో అనేక అభివృద్ధి పనులుపై గ్రామంలోఉన్న ఇతర ప్రజా సమస్యలపై సమస్యలు పరిష్కారం కోసం చర్చించారు. అలాగే గ్రామ ప్రజలు అందరూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందించాలని సర్పంచ్ బాబురావు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శ కె.అర్జున్, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు అన్నం సాంబమూర్తి, బొబ్బిలి రాము, కోన శ్రీను, కొప్పాక శంకరరావు, అన్నం శంకరరావు, కోమార బాబురావు, కడిమి నాగేశ్వరావు, గ్రామ సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో ఉత్కంఠ భరితంగా క్రీడోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-రోలుగుంట: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రోలు గుంట జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ పోతుల లక్ష్మీ రమణమ్మ, ఎంపీపీ ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంఈవో జగ్గారావు, హెచ్ఎం శేషగిరిరావు హాజరై దీపప్రజ్వలన చేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, పోటీ తత్వం పెంపొందించడమే ఈ క్రీడోత్సవాల ముఖ్య లక్ష్యమని అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ ఎర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావడానికి ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. మొదటి రోజు 14, 17 ఏళ్ల బాలుర విభాగాలకు సంబంధించిన కబడ్డీ, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ వంటి విభిన్న క్రీడాపోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. మండలంలోని అన్ని పాఠశాలల నుండి పీఈటీలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటస్థలాలు విద్యార్థులు, అభిమానులతో కిక్కిరిశాయి. కబడ్డీ పోటీలు అత్యంత రసవత్తరంగా జరిగాయి. ప్రతి జట్టు గెలుపుకోసం పట్టుదలతో పోరాడగా, ప్రేక్షకులు కేరింతలతో ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. కొన్ని మ్యాచ్‌ల్లో తేడా కేవలం ఒక్క పాయింట్ మాత్రమే రావడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. శనివారం బాలికల విభాగపు క్రీడలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

చెట్ల నరికివేత పై సర్వత్రా విమర్శలు

విశాలాంధ్ర -పాయకరావుపేట: పట్టణంలోని ఇందిరా కాలనీలో దశాబ్ద కాలం నాటి చెట్లను నరికివేత పై సర్వతా విమర్శలు వినిపిస్తున్నాయి. చెట్లు కాలం చెల్లిపోయాయని, వాటర్ ట్యాంకు, పాఠశాలపై చెట్లు విరిగిపడిపోతే నష్టం జరుగుతుందనే కారణంతో చెట్లు నరికేసారని పంచాయతీ అధికారులు చెబుతున్నప్పటికీ, గుట్టు చప్పుడు కాకుండా ఆక్షన్ వేసారని పలువురు ఆరోపిస్తున్నారు. సుమారు 50 సంవత్సరాలు పైగా వయస్సు ఉన్న యుకలిప్టస్ చెట్లు సుమారు రెండు లక్షల విలువ ఉంటుందని, అయితే కేవలం రూ.9,450 లకే చెట్లు నరికి వేసి కలప పట్టుకెళ్లేందుకు పంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వడం పలు అనుమానాలకు దారితీస్తుందని స్థానికులు విమర్శిస్తున్నారు. చెట్లు కాలం చెల్లకపోయినా కావాలనే నరికి వేశారని, నరకవలసి వస్తే కొమ్మలు నరికితే సరిపోతుంది కదా అని ప్రశ్నిస్తున్నారు. చెట్లు పూర్తిగా తొలగించాల్సి వస్తే పంచాయతీ అధికారులే దగ్గరుండి చెట్లు నరికి వేయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాలో జమ చేయొచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పంచాయితీ ఇంచార్జ్ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ మాట్లాడుతూ డిఎల్ పిఓ, రెవెన్యూ, పంచాయితీ అనుమతులతోనే చెట్లు నరికి వేసినట్లు తెలిపారు.

బస్సు జాత జయప్రదం చేయండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్

విశాలాంధ్ర -అనకాపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు జాత జయప్రదం చేయాలని సిపిఐ కార్యాలయంలో శనివారం గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని అక్టోబర్ 22న ఇచ్చాపురంలో ప్రారంభమై నవంబర్ 12వ తేదీ అనంతపురంలో ముగింపు సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో విద్యారంగానికి ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న 6400 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల పిపిపి విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వైద్య విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 107,108 మరియు పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దుచేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలు నేటి వరకు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మండిపడ్డారు తక్షణమే జీవో నెంబర్ 107 108 77 రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ గురుకుల కేజీబీవీ మోడల్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించి పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ చార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు పెంచి విడుదల చేయాలని, ఖాళీగా ఉన్నట్టు వార్డెన్ పోస్టులు భర్తీ చేయకుండా మూడు నాలుగు హాస్టళ్లకు ఒకరే వార్డెన్ లో నియమించడం వల్ల విద్యార్థులు సరైనటువంటి సౌకర్యాలు అందడం లేదని మండిపడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు ఈ సమస్యల పైన రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు జాత జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి జగదీష్, సింహాద్రి, జిల్లా నాయకులు రాజు, కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

రాంకో సిమెంట్

నాణ్యత, ప్రమాణాలకు పురస్కారం

విశాలాంధ్ర -కశింకోట: మండలంలోని ఏ .ఎస్.పేట రాంకో సిమెంటు కర్మాగారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అవార్డు అందించింది. సిమెంట్ తయారీలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటించి నాణ్యమైన సిమెంట్ అందిస్తున్న ఈ కర్మా గారానికి అవార్డు రావడం ఆనందదాయకమని యూనిట్ హెడ్ సికిందర్ బాషా అన్నారు. ఈమేరకు విజయవాడలో బీఐఎస్ డైరెక్టర్ ప్రేమ సజని పట్నాల చేతులమీదుగా ప్లాంట్ డీజీఎం, ప్రొసెస్ క్వాలిటీ హెడ్ సిహెచ్ సురేష్ కుమార్ అవార్డును స్వీకరించారు. కార్మికుల, ఉద్యోగుల సమష్టి కృషితో ఈవిజయం లభించిందన్నారు.

సిజెఐ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

విశాలాంధ్ర -సబ్బవరం: సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ పై కోర్టులో రాకేష్ కిషోర్ అనే సీనియర్ న్యాయవాది దళిత జస్టిస్ గవాయి గారిపై తన బూటిని విసిరి దాడి చేయడం జరిగింది ఈ దాడిని వాసవిక దాడిగా ఖండిస్తూ ఈ దాడి రాజ్యాంగంపై దాడిగా ఖండిస్తూ రాకేష్ కిషోర్ పై కేసు నమోదు చేయాలని అలాగే న్యాయపరంగా తగు చర్యలు తీసుకుని శిక్షించాలని కోరుకుంటూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు ఆదేశాల మేరకు సబ్బవరం మండల తాసిల్దార్ కి MRPS, MEF, MSP, ఇతర అనుబంధ సంఘ నాయకులు, అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య సలహాదారులు దువ్వుదుర్గాలు, పెందుర్తి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ ఇండిగుబల్లి గోపి, అనకాపల్లి జిల్లా MEFఅధ్యక్షులు నీటిపల్లి ముత్యాలరావు, అనకాపల్లి జిల్లాMSP ఉపాధ్యక్షులు మారుదు బూడి కోటి, పెందుర్తి నియోజకవర్గం MEF ఇంచార్జ్ నీటి పల్లి కొండబాబు, మధు, సబ్బవరం మండల MRPS అధ్యక్షులు బొర్రా జయరాజు కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



విశాలాంధ్ర -సబ్బవరం: మండల పరిధిలోని తవ్వవానిపాలెం గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలవల్ల ఉన్నత చదువులకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఎంఈఓ- 1 ఎస్.లక్ష్మణరావు ఎంఈఓ- 2 రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ భోకం స్వామినాయుడు, మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ పి నాయుడు మండల ఎస్ జిఎఫ్ కోఆర్డినేటర్ అబ్దుల్ రహిమాన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాక్షిపై కక్ష సాధింపులకు నిరసనగా జర్నలిస్టులు ఆందోళన

విశాలాంధ్ర -అనకాపల్లి: నెల్లూరు జిల్లాలోని సాక్షి కార్యాలయంపై దాడులు, అక్రమ కేసులకు నిరసనగా అనకాపల్లి ఆర్డీవో కార్యాల యం వద్ద శుక్రవారం నిరసనకు దిగిన జర్నలిస్టులు,ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన జర్నలిస్టులు, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, దాడులను అరికట్టాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని నినాదాలు. అనంతరం అనకాపల్లి ఆర్డీవో ఆయేషా కు వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఆళ్ల వెంకటప్పారావు, రామచంద్రరావు, మళ్ల భాస్కరరావు, భీమరశెట్టి గణేష్, వీరబాబు, పెద్దాడ నాయుడు, చాగంటి సర్వారావ్, ఎల్లపు రమణజి, బుదిరెడ్డి మధు, పెంటకోట సత్యనారాయణ, మంత్రి నారాయణ మూర్తి, బొడ్డెడ అప్పారావు, ఎడ్ల రామకృష్ణ, కాండ్రేగుల బోసు, కర్రీ గంగాధర్, బొడ్డెడ కృష్ణ, బొదపూ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా, విలేకరుల పై దాడులు, వేధింపులు ఆపాలి

ఏఐటీయూసీ రాష్ట్ర నేత కోన

రాష్ట్ర వ్యాప్తంగా విలేకరుల,మీడియా సాక్షి మీడియా పై దాడులు, పోలీస్, ప్రభుత్వం వేదింపులు ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ ఒక్క ప్రకటన లో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లో వచ్చిన తర్వాత పత్రిక, టివి ఛానల్ పై ఆంక్షలు పెట్టడం సిగ్గు చేటు అని విమర్శించారు. అధికారంలో రాకముందు పత్రిక స్వేచ్ఛ కాపాడుతాము అని, విలేకరుల కు భద్రత కల్పించితాం అని చెప్పి ఇప్పుడు అధికారం లో వచ్చిన తర్వాత భద్రత లేదు కదా భయం పెట్టతున్నారు అని అన్నారు కూటమి ప్రభుత్వం ఇలాంటి చర్యలు మానుకోవాలని లేకుంటే తగిన గుణపాఠం తప్పదు అని అన్నారు.

హైకోర్టు ఆదేశాల ప్రకారం రోడ్డు విస్తరణ బాధితులకుపరిహారం ఇవ్వాలి

- టీడీఆర్ నోటిఫికేషన్ రద్దుపై హర్షం

- సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-మునగపాక: అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు,ఇళ్ల స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలన్న హైకోర్టు ఆదేశాలను అమలుచేయాలని నిర్వాసితుల సంఘం డిమాండ్ చేసింది.టీడిఆర్ బాండ్లపై ఇచ్చిన నోటిఫికేషన్ హైకోర్టు డిస్మిస్ చేయడంపై హర్షం వ్యక్తం చేసింది.శుక్రవారం మునగపాకలో జరిగిన సమావేశంలో అనకాపల్లి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు నగదు చెల్లించకుండా,టీడిఆర్ లు ఇస్తామనడం ఆమోదయోగ్యంకాదని ఇచ్చిన హామీ ప్రకారం 2013 చట్టం ప్రకారం నిర్వాసితులకు నగదు చెల్లించాలని,విఎమ్ఆర్డిఏ నోటిఫికేషన్ తిరస్కరిస్తూ 14-10-2025న గౌరవ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ,నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము,కో కన్వీనర్ కే రామ సదాశివరావు,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు,ఎస్ బ్రహ్మాజీ,ఆళ్ల మహేశ్వరరావు,కె. రాము,టెక్కలి జగ్గారావు,కొండ్రపు సోమునాయుడు,ఎం వి ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద మాకవరం అంగన్వాడీలో కమ్యూనిటీ అవగాహన

విశాలాంధ్ర-అనకాపల్లి: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఎన్. సూర్యలక్ష్మి వారి ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో మండలంలో పెదమాకవరం గ్రామంలో అంగన్వాడి సెంటర్లో కమ్యూనిటీ అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ సలహాదారురాలు ఎండి గౌషియా భాను మాట్లాడుతూ. బాల బాలికలకు (ఆడపిల్ల 18 సం" మగపిల్ల 21సం ") నిండకుండా వివాహం చేస్తే అది బాల్య వివాహం అవుతుందని బాల్య వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక సమస్యలు వస్తాయని , బాల్య వివాహ నిరోధక చట్టం 2006 సెక్షన్:15 ప్రకారం లక్ష రూపాయలు జరిమానా రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని కనుక తమ గ్రామంలో ఎక్కడ కూడా బాల్య వివాహాలు చేసుకోకూడదని ఆమె తెలిపారు. బాలబాలికలకు (0 నుండి 18 సం")సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా జిల్లా బాలల సంరక్షణ విభాగం కు సంప్రదించవలసిందిగా లేదా 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ కు సమాచారం అందించవలసినదిగా ఆమె కోరారు... పిల్లలను అనధికారంగా పెంచుకుంటే అది చట్టరీత్యా నేరమని పిల్లలను పెంచుకోవాలంటే చట్టపరంగా దత్తత తీసుకోవాలని ఈ దత్తతకు సంబంధించి మన జిల్లాలో ప్రత్యేక దత్తత ఏజెన్సీ కూడా ఉందని ఆమె తెలిపారు. ఎవరికీ అయినా పిల్లలు దత్తత కావాలంటే వారు ఈ అడాప్షన్ ఏజెన్సీని సంప్రదించవలసిందిగా ఆమె చెప్పారు ఈ కార్యక్రమంలో పెదమాకవరం అంగన్వాడీ టీచర్,మహిళా పోలీస్ ఆశారాణి, ఏఎన్ఎం సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

కొరుప్రోలులో మండల స్థాయి ఆటలు పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-యస్.రాయవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు కొరుప్రోలులో నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ఆటలు పోటీలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పి .అప్పారావు ప్రారంభించారు. మండలంలో గల 17 పాఠశాల నుంచి సుమారు 350 మంది బాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చదరంగం, యోగ వంటి పోటీలు జరగనున్నాయి. మొదటి రోజు కబడ్డీ ,ఖోఖో ,వాలీబాల్ పోటీలు ఆసక్తికరంగా జరగడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. మొదటిరోజు బహుమతులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కప్పల ప్రసాద్ స్కూల్ కమిటీ చైర్మన్ బత్తిన సత్యనారాయణ ,కొరుప్రోలు పిఎసిఎస్ అధ్యక్షుడు గుర్రం రామకృష్ణ ,టిడిపి నాయకులు ప్రత్తిపాటి సత్యనారాయణ, కోరా రామారావు, కోన అప్పలరాజు, సీనియర్ ఉపాధ్యాయులు నానాజీ, రమేష్ ,వ్యాయామ ఉపాధ్యాయులు అమ్మోరియ్య, ప్రేమ్ కుమార్ ,కుమార్ రాజా, గెట్టం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-పాయకరావుపేట : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే మండల స్థాయి ఆటలు పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు ఆటలు పోటీలను ప్రారంభించారు. మండలంలో 13 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొదటిరోజు 350 మంది బాలురు 7 రకాల ఆటలు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాసరావు, పల్లా విలియం కేరి, కువల కుమార్, గొల్లపల్లి నాగు, రాజాన ఆది, మండల విద్యాశాఖ అధికారి రమేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం వనరుల అభివృద్ధిపై శిక్షణ

విశాలాంధ్ర-పాయకరావుపేట : పంచాయితీల్లో ఆదాయం వనరుల అభివృద్ధిపై సర్పంచులు, పంచాయతీ కార్య దర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీల్లో ఆదాయం వనరులపై నిత్యం అన్వేషణ జరగాలన్నారు. ఇంటి పన్నులు, నీటి పన్నులు, లేఅవుట్లు, బిల్డింగ్ ప్లాన్లు, తదితర పంచాయితీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే మండలంలో 24 గ్రామాలకు గాను ఆరుగురు సర్పంచ్ లు మాత్రమే శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్, పంచాయితీ కార్యదర్శి వై. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తోటాడలో కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-మునగపాక: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు పనుతున్న కుట్రను ఆపేందుకు వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం మునగపాక మండలం తోటాడ గ్రామంలో జరిగింది.ఈ సందర్భం గా ప్రజలకు మెడికల్ కళాశాలల పీపీపీ విధానం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు,మండల యువజన విభాగం అధ్యక్షులు బొడ్డేడ లిల్లీ,ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,గ్రామ వైసీపీ అధ్యక్షులు పొలమరశెట్టి జగదీశ్వరరావు,వైసీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మదయ ఉంటే అన్ని ఉన్నట్లే..

జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ రాంకీ

విశాలాంధ్ర -కశింకోట: అమ్మవారి దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని, వర్షాలు సంమృద్ధిగా కురిసాయని, అమ్మవారు అందరిని చల్లంగా చూడాలని పూజలు నిర్వహించినట్లు అనకాపల్లి జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) అన్నారు. గురువారం రాత్రి సోమవరం గ్రామంలో ఉన్న మరిడిమాంబ అమ్మవారి పండుగలో రాంకీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు రాంకీ నీ సత్కరించి జ్ఞాపిక అందచేసారు. ప్రతియేటా దేవతలకు మొక్కులు చెల్లించుకోవడం, గ్రామీణ ప్రాంతాలలో సంప్రదాయంగా వస్తుందన్నారు. చిన్నా పెద్ద అందరూ సంతోషంగా ఉండేలా దీవించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉగ్గిన రమణ మూర్తి, ఉల్లింగల రమేష్, కర్రి సత్యనారాయణ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

తాసిల్దార్ చిన్నికృష్ణ

విశాలాంధ్ర -సబ్బవరం: మండలంలోని అనకపల్లి పంచాయితీలో అసకపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ -1 కొండ పోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణాలను స్థానిక తహసీల్దార్ బి చిన్నికృష్ణ పర్యటించి పరిశీలించారు.అసకపల్లి సర్వే నెంబర్ 1లో కొండపోరంబోకు, సర్వే నెంబర్ 16చెరువు పోరంబోకు భూముల్లో క్రొత్తగా ఆక్రమణలు గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేసారు. అసకపల్లి జగనన్న కాలనీ ప్రక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి ఫెన్సింగ్ పోల్స్ వేసి రేకుల షెడ్లు నిర్మించినట్లు గుర్తించామన్నారు. సదరు రేకుల షెడ్లల్లో ప్రభుత్వ భూమి అని హెచ్చరిక లు బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఆక్రమణ దారులపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆక్రమణదారులపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు మరియు ల్యాండ్ గ్రాబింగ్ కేసుల నమోదు చేయడం జరిగిందని స్పష్టం చేశారు.

స్వచ్ఛమైన గాలి-మానవ ఆయుష్షు పెంచుతుంది

విశాలాంధ్ర -సబ్బవరం: మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా, స్వచ్ఛమైన గాలి పీల్చడం ద్వారా మానవుని యొక్క ఆయుష్ పెరుగుతుందని,, కాబట్టి స్వచ్ఛమైన గాలిని ఎలా కలుషితం చేస్తున్నారు అనే విషయాన్ని కళాశాల విద్యార్థులకు తెలియజేసేవిధంగా జాతీయ సేవా పథకం విద్యార్థులు ప్రత్యేకమైన అవగాహన తరగతులు నిర్వహించి, తరువాత కళాశాల నుండి సబ్బవరం నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సత్యనారాయణ,జాతీయ సేవ పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.